క్లుప్తంగా

ఆటోను ఢీకొన్న లారీ



మేదరమెట్ల వద్ద జరిగిన ప్రమాదంలో డివైడర్ పైకి ఎక్కిన ఆటో

మేదరమెట్ల: ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొన్న సంఘటన బుధవారం మేదరమెట్ల దక్షిణ బైపాస్ వద్ద చోటు చేసుకుంది. రాజంపేట నుంచి గుంటూరుకు బొప్పాయి కాయల లోడుతో వెళుతున్న ఆటో టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలుపుకున్నాడు. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన లారీ ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో పాక్షికంగా దెబ్బతింది.

విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించండి



కారంచేడులో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి వారిని చక్కదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈఓ ఎంవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు ఎన్టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో వార్షిక తనిఖీ నిర్వహించారు. సరళంగా ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారో పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా మెనూ అమలు చేయాలని ఆదేశించారు. హెచ్ఎం రావి పద్మావతి, ఉపాధ్యాయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం వినియోగించుకోండి



భవిత కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ

బల్లికురవ: దివ్యాంగ చిన్నారులను సాధారణ పిల్లలతో సమానంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఎంఈవో వస్రాం నాయక్ కోరారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో అందిస్తున్న సేవలు రికార్డులు పరిశీలించారు. ప్రతి బుధవారం జరిగే క్యాంపులకు చిన్నారులను తీసుకురావాలని కోరారు. పౌష్టికాహారం.. నిత్య వ్యాయామంతో స్వస్థత చేకూర్చవచ్చన్నారు. ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని, నాగబాబు నాజీలీ పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం.. దక్షిణాయనం కార్తిక మాసం పూర్వాషాడ నక్షత్రం షష్టి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

చీరాల అర్బన్: పట్టణంలోని విఠల్‌నగర్‌లో చైతన్య వికాస కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు బుధవారం కంటి వైద్యపరీక్షలను నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి కంటి వైద్యులు వెంకటేశ్వర్లు పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం ఇద్దరికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి వారికి త్వరలో శస్త్ర చికిత్స చేస్తామని వైద్యులు తెలిపారు. ఈమేరకు చైతన్య మనోవికాస కేంద్రం డైరెక్టర్ ఎన్.వెంకన్న బాబు తెలిపారు.

రామ్మోహన రెడ్డి బాధ్యతల స్వీకరణ

పర్చూరు (చినగంజాం): పర్చూరు మండల వ్యవసాయాధికారిగా ఎస్. రామ్మోహనరెడ్డి తిరిగి నియమితులయ్యారు. బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించినట్లు పర్చూరు వ్యవసాయ సంచాలకులు ఎన్. మోహనరావు తెలిపారు

ప్రయాణం నరకం



బల్లికురవ- కొణిదెన మధ్య గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డు (ఫైల్)



కొణిదెన- మార్టూరు మధ్య పగులగొట్టిన రోడ్డులో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

- నత్త నడకన కొణిదెన రోడ్డు అభివృద్ధి పనులు
- రోడ్డు పగులగొట్టి వదిలేసిన వైనం
- వాహన చోదకులు, ప్రయాణికుల పాట్లు

బల్లికురవ:

కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని గాలికి వదిలేసింది. బల్లికురవ–కొణిదెన– మార్టూరు రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగటంలేదు. ఈ రోడ్డు 11 కిలోమీటర్ల మేర ఉంటే.. అడుగడుగునా మోకాటి లోతు గోతులు ఏర్పడ్డాయి. పనులు ముందుకు సాగనందున ఇటీవల వర్షాలకు ఈ గుంటల్లో వర్షపు నీరు నిలబడి దోమలకు ఆవాసంగా మారడంతో పాటు పాటుదుర్గంధం వెదజల్లుతోంది. ఇటీవల రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరు కావడంతో టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ గోతులు పూడ్చి రోడ్డు అభివృద్ధి చేసేందుకు రెండు నెలల క్రితం పనులకు శ్రీకారం చుట్టాడు. కానీ పొక్లెయిన్‌తో గోతులు చదరం చేసి ఊరుకున్నాడు. నిబంధనల ప్రకారం వెట్ మిక్స్ రోడ్డుపై వేసి రోలర్‌తో తిప్పాలి. అనంతరం తారు వేయాల్సి ఉంటుంది. కానీ ఈ పననులు చేయలేదు. రెండు నెలలు అవుతున్నా అతీగతీ లేదు. పది గ్రామాల ప్రజలకు చెందిన సుమారు 20 వేల మంది నిత్యం ఈ రోడ్డు నుంచే మండల కేంద్రం అయిన బల్లికురవ, నియోజకవర్గ కేంద్రమైన అద్దంకికి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. కానీ గోతులమయమైన 11 కిలోమీటర్ల రోడ్డు దాటేందుకు గంటకు పైగా సమయం పడుతోంది. దీనికితోడు బల్లికురవలోని ఈర్లకొండ నుంచి గ్రానైట్ ముడి రాళ్లు, మీటర్ రాళ్ల లారీలు ఈ రోడ్డు నుంచే ప్రయాణం చేసి మార్టూరు, కొణిదెనలోని గ్రానైట్ పరిశ్రమలకు వెళ్లాలి. ఇవి భారీ బరువుతో ఉండటంతో ఈ రోడ్డు ఇంకా అధ్వానంగా మారుతోంది. ఈ విషయమపై ఆర్అండ్‌బీ జేఈ బాబ్జిని వివరణ కోరగా.. వర్షాలు పడటంతో పనులు ఆలస్యం అయ్యాయని.. వారం రోజుల్లో మరమ్మతులు పూర్తి చేస్తామని చెప్పారు.



పొక్లెయిన్‌తో చదరం చేస్తున్న దృశ్యం (ఫైల్)

కొణిదెన రోడ్డు అభివృద్ధి చేయండి



కొణిదెన రోడ్డుకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో మోకాటి లోతు గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. ఈ రోడ్డులో తిరిగే సింగిల్ బస్సు కూడా.. ట్రాఫిక్ జాం వల్ల, గుంతల వల్ల సరిగా ట్రిప్పులు వేయడంలేదు.

తస్నీరు రామాంజనేయులు

కత్తెర పురుగు నివారణ అవసరం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకట కృష్ణ



ప్రాసంగులపాడులో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో శ్రీనివాసరావు

అద్దంకి: మొక్కజొన్నలో కత్తెర పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకష్ణ సూచించారు. అద్దంకి పట్టణం దామావారిపాలెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. మొక్కజొన్నలో పాక్షికంగా నష్టం జరిగిందని తెలిపారు. మందులు పిచికారీ చేసుకునేటప్పుడు మొవ్వ సుడులు బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. శనగ, మొక్కజొన్న, మినుము, వరి పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి ఎస్. దీప్తి మాట్లాడుతూ బిందు.. తుంపర సేద్య పరికరాలు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ సహాయకులు పాలడుగు శేషారావు, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, దామా శ్రీనివాసరావు, దామా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

మేదరమెట్ల: శనగ విత్తుకునే ముందు ప్రతి కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి చేసుకోవాలని వ్యవసాయాధికారి పి.శ్రీనివాసరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రావినూతల, ప్రాసంగులపాడు గ్రామాల్లో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఎకరాకు 30–35 కిలోల శనగ విత్తనాలను విత్తుకోవడం మంచిదని సూచించారు. వీఏఏ మౌనిక, వీహెచ్ఏ రాణి, రైతులు పాల్గొన్నారు

25 శాతం సబ్సిడీపై పప్పు శనగలు సిద్ధం

బల్లికురవ: రబీలో పప్పుశనగ సాగుచేసే రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా 25 శాతం సబ్సిడీపై జేజీ 11, కాక్ 2 రకం విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయాధికారి ఎస్వీపీ కుమారి తెలిపారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొణిదెన, కె.రాజుపాలెం గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. జేజీ 11 సబ్సిడీ పోను క్వింటాళ్లు 7050, కాక్ 2 రకం 9075 అందజేస్తామని.. కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నాకు న్యాయం చేయండి

- సమావేశంలో మహిళ ఆవేదన
- మీడియా జోక్యంతో ఫిర్యాదు తీసుకున్న సీఐ



మాట్లాడుతున్న బాధితురాలు అరుణ

మార్టూరు: తనపై దాడి జరిగి నెలరోజులు గడిచినా.. ఎస్పీ గ్రీవెన్స్ సెల్ నుంచి ఆదేశాలు వచ్చినా మార్టూరు సీఐ మద్దినేని శేషగిరిరావు తనకు న్యాయం చేయడం లేదంటూ ఓ మహిళ బుధవారం మీడియా ముందు వాపోయింది. బాధితురాలు.. సీఐ శేషగిరిరావు వివరాల మేరకు.. స్థానిక కొణిదెన రోడ్డులో చికెన్ పకోడి షాపు నిర్వహిస్తున్న కీలం అరుణపై పక్కింటికి చెందిన పొట్రు పవన్ అనే యువకుడు అక్టోబర్ 2వ తేదీ దాడి చేసి గాయపరిచాడు. గాయాలతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అరుణను ఆసుపత్రి సిబ్బంది సమాచారంతో.. ఇద్దరు పోలీసులు వచ్చి ఫిర్యాదు రాసుకొని వెళ్లారు. తనను మాత్రమే పోలీస్ స్టేషన్‌కు పిలిచి, నిందితులను పిలవకపోవడం, మరుసటి రోజు సాయంత్రం వరకు ఎలాంటి ఫలితం లేకపోవడంతో నాలుగో తేదీ ఎమ్మెల్యే ఏలూరిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన అరుణ తన బాధను చెప్పుకుంది. ఆ సమయంలో అక్కడే ఉన్న మార్టూరు టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్ కలుగజేసుకుని.. అది చాలా చిన్న విషయమని తాను చూసుకుంటానని చెప్పి అనంతరం అరుణను ఫిర్యాదు వెనక్కి తీసుకోవాల్సిందిగా ఒత్తిడి చేయసాగాడు. స్థానిక పోలీస్ స్టేషన్లో తనకు న్యాయం జరగదని భావించిన బాధితురాలు అక్టోబర్ 7వ తేదీ బాపట్లలో గ్రీవెన్స్ సెల్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదును విచారించవలసిందిగా తిరిగి సీఐ వద్దకే ఆదేశాలు వచ్చినా ఎలాంటి పురోగతి లేకపోవడం గమనార్హం. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం విలేకరుల ముందు తన బాధను వెళ్ళబోసుకుంది. మీడియా ప్రతినిధులతో అరుణ సమావేశం గురించి తెలుసుకున్న సీఐ అదే సమయంలో విలేకరులకు ఫోన్ చేసి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. మెడికో లీగల్ కేసుతో పాటు గ్రీవెన్స్ సెల్ నుంచి ఆదేశాలు వచ్చినా కేసు ఎందుకు నమోదు చేయలేదని విలేకరులు సీఐని ప్రశ్నించారు. దీంతో ఈరోజు రమ్మనండి కేసు నమోదు చేస్తాను, ఆమెపై అవతలి వారు కూడా అప్పట్లో ఫిర్యాదు చేశారు ఇద్దరిపై కేసు నమోదు చేస్తాను అని సీఐ చెప్పడం గమనార్హం. ఎట్టకేలకు బుధవారం రాత్రి స్టేషన్ సిబ్బంది రాజేష్, అరుణను స్టేషన్‌కు పిలిపించి ఆమె నుంచి మరలా కొత్తగా ఫిర్యాదు తీసుకొని పంపించటం కొస మెరుపు.

మానవుని మహనీయుడిగా చేసేదే భగవద్గీత



పుస్తకాలను అందిస్తున్న నాగేశ్వరరావు, చంద్రమౌళి

అద్దంకి: భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు చెప్పిన విధంగా నాడుచుకుంటే మానవుడే మహనీయుడుగా మారుతాడని టీటీడీ దాస సాహిత్య కోఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ×మానవులందరికీ భగవద్గీత₹ పుస్తకాలను హైస్కూలు హెచ్ఎం శ్రీమతి డోలా పద్మావతికి అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ నేటి కాలంలో భగ్గవద్గీత చదవడం చలా ఉపయోగంగా ఉంటుందన్నారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ ఈ సృష్టిలో తల్లి, తండ్రి, గురవు, దైవంకు జీవితం అంకితమివ్వాలని చెప్పారు. 350 మంది విద్యార్థులకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అందజేయడం అభినందనీయమన్నారు. అధ్యాపకులు లక్ష్మీనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రాణాలకు ముప్పు

కారంచేడు: ఆటోవాలాలు అధిక జనాభాను ఎక్కించడం, మితిమీరిన వేగంతో ప్రయాణించడం ప్రాణాలకు ముప్పు తెస్తుందని ఎస్ఐ వి. వెంకట్రావు హెచ్చరించారు. బుధవారం కారంచేడులోని అంబేడ్కర్‌నగర్, ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఏర్పాటు చేసిన తనిఖీల్లో పలు చలానాలు విధించారు. ఆటోవాలాలు తప్పకుండా వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. అలాగే ఆటోల్లో పరిమితికి మించిన జనాభా ఎక్కించుకోవద్దని చెప్పారు. ఎక్కువ మందితో.. మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ అనేక ఆటోలు ప్రమాదాలకు గురవ్వడమే కాకుండా అనేక మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం హెల్మెట్ లేని ప్రయాణం చేయకూడదని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన పలువురికి చలానాలు విధించారు.



కారంచేడులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కొత్తపాలెంలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

చినగంజాం: కొత్తపాలెం పంచాయతీలోని ఉప్పు కొఠారు కొత్తపాలెం గ్రామంలో లోవోల్టేజీ సమస్యను తొలగించేందుకు విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం రాత్రి వేటపాలెం ఏడీ శ్రీనివాసరావు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కొత్తపాలెం ఎంపీటీసీ ఎం. రాంబాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ బత్తుల సింగయ్య, ఏఎల్ఎం శంకర శ్రీనివాసరావు, తిరుపతి శేఖర్ బాబు, సురేష్ బాబు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఏలూరులో మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇస్తున్న 104 సిబ్బంది

పొదిలి రూరల్: 104 వాహనాల్లో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం పొదిలి మండలంలోని ఏలూరు సచివాలయంలో విధుల్లో ఉన్న కాకర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎన్. సాయి రుచితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ.. తమకు గత మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించడం కష్టంగా ఉందన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా రూ.50 వేలు ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనం చెల్లించాలని కోరారు. అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, డ్రైవర్లకు లాక్ స్లాబ్ అమలు చేయాలని, డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్ట్‌లో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని, యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించి విధంగా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో డీఈఓ చిరంజీవి, డ్రైవర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



నిరాహార దీక్షలో వారికి మద్దతు తెలిపిన గ్రామస్తులు

వేటపాలెం: పందిళ్లపల్లిలోని ప్రభుత్వం వైద్యశాల శిథిలావస్థకు చేరిందని దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలని తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. గ్రామంలోని పెద్దలు సంఘీభావం పలుకుతున్నారు. కానీ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సమస్య పరిష్కరించని పక్షంలో దీక్షలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. న్యాయమైన ప్రజల కోరికను ప్రభుత్వం ఉన్నతీ అధికారులు, రాజకీయ నాయకులు పట్టించు కోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఉచితంగా అందించాల్సిన విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులను రాజకీయ నాయుకులు విస్మరిస్తూ ప్రైవేటు వ్యక్తులకు వంత పాడేలా వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఆర్ఎంపీ వైద్యులు దోపిడీ పెరిగి పోయిందని, ఎటువంటి అనుభవం లేకపోయినప్పటికి ప్రథమ చికిత్సపేరుతో బోర్డులు ఏర్పాటు చేసుకొని ప్రజల వద్ద వేలల్లో దోచుకుంటున్నారని తెలిపారు. ఆర్ఎంపీలు రిఫరల్ పేరుతో పెద్ద వైద్యశాలలకు రోగులను పంపిస్తూ డబ్బు వసూలు చేసుకుంటున్నారన్నారు. జిల్లా వైద్యాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోక పోగా ప్రభుత్వ వైద్యశాలలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్యశాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు.

కౌశల్ 2024 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ పురుషోత్తం, తదితరులు

చీరాల అర్బన్: భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌశల్ 2024 రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల పోస్టర్‌ను బుధవారం స్థానిక వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీలో డీఈఓ ఎస్. పురుషోత్తం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే 8,9,10 విద్యార్థులకు క్విజ్, పోస్టర్, రీల్స్ విభాగాల్లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయి విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో పోటీతత్వం పెంపొందించేందుకు వారిలో సృజనాత్మకత వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి పాఠశాల నుంచి క్విజ్‌కు తరగతికి ముగ్గురు చొప్పున 9 మంది, పోస్టర్, రీల్స్‌కు తరగతికి ఇద్దరు చొప్పున ఆరుగురు విద్యార్థులు ఒక్కో పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అన్ని ప్రభుత్వ పాఠశాలలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. పాఠశాల స్థాయిలో ఈనెల 20 నుంచి 22 తేదీ లోపు, జిల్లా స్థాయిలో డిసెంబర్ 6న ఆన్‌లైన్‌లో రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 30న విజయవాడలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఎంఓ మోజెస్, జిల్లా కౌశల్ కో–ఆర్డినేటర్ పి.పూర్ణ చంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి సాధిక్, సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, సంజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో అభివృద్ధి సాధ్యం



చింతగుంపల్లి గ్రామంలో గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీఓ లక్ష్మీదేవి

చినగంజాం: ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఉపాధి హామీ ఏపీఓ జె. లక్ష్మీదేవి అన్నారు. మండలంలో బుధవారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలో ఉపాధి పనుల గుర్తింపు, నిర్వహణకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భాగంగా మున్నం వారిపాలెం, నీలాయపాలెం, చింతగుంపల్లి, మోటుపల్లి పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో ఇప్పటి వరకు గుర్తించిన పనులను చదివి వినిపించారు. ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వడ్లమూడి సాంబశివరావు, తూమాటి శ్రీనివాసరావు, నారాయణరావు, నల్లమోపు పద్మావతి, గ్రామ కార్యదర్శులు, వెల్‌ఫేర్ అసిస్టెంట్‌లు, పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 37 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న దృశ్యం

చీరాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈపురుపాలెంలోని ఎస్‌కేబీఎస్ఎం ఐటీఐ కాలేజీలో జాబ్ మేళాను నిర్వహించారు. అమరరాజా బ్యాటరీస్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, రాయల్ మెరైన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన నాదెండ్ల కోటేశ్వరరావు మాట్లాడారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే జాబ్‌మేళాలను, శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు మొత్తం 68 మంది హాజరు కాగా వీరిలో 37 మంది హాజరైన కంపెనీలకు ఎంపికయ్యారని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.ప్రణయ్ తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ అబ్దుల్ సత్తార్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా వారోత్సవాలతో ప్రమాదాల నివారణ



భద్రతా చర్యలు వివరిస్తున్న సభ్యులు

బల్లికురవ: గనుల్లో ప్రతి సంవత్సరం భద్రతా వారోత్సవాలు చేపట్టం వల్ల ప్రమాదాల శాతం తగ్గిందని ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల మైన్స్ టీమ్ సత్యసుందర్, శివనారాయణ అన్నారు. బుధవారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ శ్రీశ్రీనివాస, లక్ష్మీ, సత్యకృష్ణ, నరసింహారావు క్వారీల్లో భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. జెండా ఆవిష్కరణ తో కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించారు. క్వారీల రికార్డులు, హద్దులకు సంబంధించిన మ్యాపు పనులు చేసే ప్రదేశాన్ని సౌకర్యాలను పరిశీలించారు. భద్రతా చర్యలు పాటిస్తామని కార్మికులు క్వారీ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. క్వారీల మేనేజర్లు గుంటక తిరుపతిరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.